
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY















దీపావళి దివ్వెలు



దీపావళి పండుగ సందడి మొదలైంది. వివిధ రకాల దివ్వెలు సిద్దిపేట పట్టణంలో మెదక్ రోడ్, డిగ్రీ కళాశాల, గాంధీ రోడ్, రైతు మార్కెట్ వద్ద విక్రయిస్తున్నారు. రకాల రకాల దీపాంతలు తీరొక్క ఆకృతిలో ఆకట్టుకుంటున్నాయి. సైజును బట్టి రూ.50 నుంచి అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటుగా పలు బొమ్మలను అమ్ముతున్నారు. పండుగ సమీపిస్తుండటంతో కొనుగోలు చేస్తున్నారు.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి)

రక్తదానంతో ప్రాణదానం

సీపీ డాక్టర్ బి.అనురాధ



రక్తదానం శిబిరాన్ని పరిశీలిస్తున్న సీపీ

సిద్దిపేట క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రక్తదానంతో మరొకరి ప్రాణం నిలబెట్టవచ్చు అని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారం సందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరంలో 62 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసు వీరులను ఈ సమాజం ఎప్పుడూ గుర్తుంచుకుంటుందని అన్నారు. అమ్మ జన్మనిస్తే రక్తదానం పునర్జన్మనిస్తుందని అన్నారు. ఆరోగ్యంగా ఉండే ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని, ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను రక్షించడానికి ఉపయోగపడుతుందన్నారు. రక్తదానం చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని సీపీ అభినందించారు. జిల్లాలో ఒక గ్రూప్ ఏర్పాటు చేసుకుని ఆపదలో ఉన్నవారికి పోలీస్ సిబ్బంది రక్తం దానం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ యస్ మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ మధు, ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, పట్టణ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

పశుగణన షురూ



నాలుగు నెలల పాటు సర్వే

- విధుల్లో 95 మంది ఎన్యుమరేటర్లు, 35 మంది సూపర్‌వైజర్లు
- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు
- ఫిబ్రవరి 28 వరకు వివరాల సేకరణ

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పశుసంపదకు ఎనలేని ప్రాధాన్యం ఉంది. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో పశువులు కీలకపాత్ర పోషిస్తాయి. భూమిలేని అనేక కుటుంబాలకు ప్రాథమిక ఆదాయ వనరు కూడా. అంతేకాకుండా పాలు, గుడ్లు, మాంసం, ఉన్ని ఉత్పత్తుల ద్వారా జాతీయ ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా దోహదపడతాయి. పాడి పశువుల సంక్షేమానికి చర్యలు తీసుకునేందుకు, పశువుల లెక్క తేల్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఐదేళ్లకోసారి నిర్వహించే పశుగణన పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రారంభమైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగనున్నది. జిల్లా వ్యాప్తంగా 499 గ్రామ పంచాయతీల పరిధిలో దాదాపు 16 రకాల పశుజాతుల వివరాలను సేకరించనున్నారు. సర్వే కోసం 95 మంది ఎన్యుమరేటర్లు, 35 మంది సూపర్‌వైజర్లు, ఒక జిల్లా నోడల్ అధికారిని నియమించారు.



పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

గతంలో కంటే తగ్గనున్న పశువులు?

పశుగణన 1919వ సంవత్సరంలో ప్రారంభమైంది. అప్పటి నుంచి ప్రతీ ఐదేళ్లకోసారి నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 20 సార్లు చేపట్టారు. చివరి పశుగణన 2019లో జరిగింది. ఐదేళ్ల క్రితం కంటే ఈసారి పశువులు బాగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. పల్లెల్లో కాడెడ్లు, పాడిపోషణ, గొర్రెలు, మేకలు తగ్గుముఖం పట్టాయి. గతంలో 1,47,705 ఆవులు, 2,05,357 గేదెలు, 2,10,267 మేకలు

తరువాయి 8వ పేజీలో

పశువుల సమగ్ర సమాచారం అందించాలి : కలెక్టర్

పశువుల సమగ్ర సమాచారం అందించి పశుగణన రంగ పథకాల రూపకల్పనకు సహకరించాలని కలెక్టర్ మనుచౌదరి రైతులకు పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టర్ కాన్ఫరెన్స్‌హాల్‌లో 21వ అఖిల భారత పశుగణన తెలంగాణ పోస్టర్‌ను పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అధికారులు ఇంటింటికీ తిరిగి గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు, కోళ్ల వివరాలను సేకరిస్తారని పేర్కొన్నారు. పశుగణన పూర్తయిన తర్వాత వాటి సంఖ్య ఆధారంగా వ్యాక్సిన్లు, సబ్సిడీ దాణ, ఇతర పథకాల రూపకల్పన ప్రభుత్వానికి సులభంగా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్. జగత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల బదిలీలు

ఉమ్మడి జిల్లాలో ఇద్దరు అదనపు కలెక్టర్లు, ముగ్గురు ఆర్డీవోలకు స్థానచలనం



సంగారెడ్డి టౌన్/సిద్దిపేట కలెక్టరేట్/మెదక్ అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో పలువురు అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులను జారీ చేసింది. మెదక్, సిద్దిపేట అదనపు కలెక్టర్లతో పాటు జహీరాబాద్, నర్సాపూర్, గజ్వేల్ ఆర్డీవోలు ట్రాన్స్‌ఫర్ అయ్యారు.

సిద్దిపేట అదనపు కలెక్టర్‌గా అబ్దుల్ హమీద్

రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్‌గా విధులను నిర్వర్తిస్తున్నా అబ్దుల్ హమీద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో బాధ్యతలను స్వీకరించనున్నారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి ఖమ్మం అదనపు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన 2022 జనవరి నుంచి నేటి వరకు జిల్లాలో విధులు నిర్వర్తించారు.

మెదక్ అదనపు కలెక్టర్‌గా మెంచు నగేష్

మెదక్ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) జి.వేంకటేశ్వర్లు వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వనపర్తి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న మెంచు నగేష్‌ను నియమించింది. అదనపు కలెక్టర్‌గా వేంకటేశ్వర్లు గతేడాది జూలై 21న బాధ్యతలు స్వీకరించగా పదిహేను నెలలు విధులు నిర్వహించారు. బదిలీపై వస్తున్న నగేష్ గతంలో మెదక్ ఆర్డీవోగా విధులను నిర్వహించారు. జిల్లాల పునర్విభజనలో జిల్లా డీఆర్వోగానూ బాధ్యతలు నిర్వర్తించారు.

నర్సాపూర్, జహీరాబాద్, గజ్వేల్ ఆర్డీవోలు బదిలీ

మెదక్ జిల్లాలోని నర్సాపూర్ ఆర్డీవోగా పనిచేస్తున్న జగదీశ్వర్‌రెడ్డిని కందుకూరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో హైదరాబాద్ ఆర్డీవోగా విధులు నిర్వహించిన కె.మహిపాల్‌రెడ్డి రానున్నారు. గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్ కొల్లాపూర్‌కు బదిలీ కాగా, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ శాఖలోని పబ్లికేషన్స్‌లో రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న వీపీఎల్ చంద్రకళను నియమించారు. జహీరాబాద్ ఆర్డీవో, సంగారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీవోగా ఉన్న ఎస్.రాజు మహబూబాబాద్‌కు బదిలీ అయ్యారు. జహీరాబాద్ నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ రవీందర్‌రెడ్డిని సంగారెడ్డి ఆర్డీవోగా నియమించారు. జహీరాబాద్ ఆర్డీవోగా మహబూబ్‌నగర్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న పి.రాంరెడ్డి నియమితులయ్యారు. సివిల్ సప్లయ్ శాఖలో పనిచేస్తున్న బి.శకుంతల జహీరాబాద్ నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా రానున్నారు.



వర్షానికి దెబ్బతినడంతో దున్నివేసిన పత్తి చేను

తగ్గిన సంపత్తి

సగానికి పడిపోయిన దిగుబడులు

- ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల లోపే
- వర్షాభావ పరిస్థితులతో పంటకు నష్టం
- ఆందోళన చెందుతున్న రైతులు

8

ఊరి కోసం గ్రంథాలయం

- తనలాగే యువత కొలువులు సాధించాలని..
- గ్రామానికి చెందిన పీడీ ఆలోచనలకు ప్రతిరూపం
- దాతల సాయంతో పుస్తకాలు..

8

కలగానే ఆధునిక గ్రంథాలయం

- సమస్యల వలయంలో దుబ్బాక విజ్ఞాన భాండాగారం
- శంకుస్థాపనతోనే సరి
- సొంత భవనం లేక అవస్థలు

7



తండ్రి సోషల్ వర్కర్.. కొడుకులిద్దరూ డాక్టర్లు

- పేదరికాన్ని జయించి.. ఎంబీబీఎస్ సీట్లు సాధించారు
- అన్నదమ్ములిద్దరికీ ఉస్మానియా మెడికల్ కాలేజీలో సీట్లు



తల్లిదండ్రులతో నాగిరెడ్డిపల్లి లెనిన్‌రాజ్, స్టాలిన్‌రాజ్

పుల్‌కల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు పేదరికం వెంటాడుతున్నప్పటికీ.. అన్నదమ్ములిద్దరూ పట్టుదలతో చదివి ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం న్యూహన్నాపూర్ గ్రామానికి చెందిన నాగిరెడ్డిపల్లి కృష్ణంరాజు, భాగ్యలక్ష్మి దంపతులకు కూతురు, ఇద్దరు కుమారులు. కృష్ణంరాజు ముప్పై ఏళ్లుగా ఆయన సామాజిక కార్యకర్తగా ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించి గుర్తింపు పొందారు. సామాజిక ఉద్యమాలు, సింగూరు ప్రాజెక్టు ముంపు బాధితులకు అండగా ఉద్యమాలు చేపట్టారు. సింగూరు ప్రాజెక్టు నిర్మాణంతో సర్వస్వం కోల్పోయిన బాధితులకు పునరావాసం కల్పించేలా నాటి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేకంగా నిర్వాసిత ప్రజల కోసం సింగూరు పునరావాస కార్యాలయం ఏర్పాటయ్యేలా కృషి చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను చైతన్య పరుస్తూ రాజ్యాంగం ప్రకారం వారికి దక్కాల్సిన న్యాయమైన హక్కుల కోసం పోరాడారు. పెద్ద కూతురుకు వివాహం జరిపించగా, ఇద్దరు కుమారులు నాగిరెడ్డిపల్లి లెనిన్‌రాజు, స్టాలిన్‌రాజులను ఎంబీబీఎస్‌లో సీటు సాధించేలా ప్రోత్సహించారు. వారిద్దరూ వైద్య విద్యలో సీట్లు సాధించడంతో పేదరికం వెంటాడుతున్నప్పటికీ

తరువాయి 7వ పేజీలో

సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) పరిధిని విస్తరిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని ఇతర మున్సిపాలిటీలతో పాటు చేర్యాల మున్సిపాలిటీని సుడాలో విలీనం చేశారు. ఈ నేపథ్యంలో పట్టణాభివృద్ధికి ఒనగూరే ప్రయోజనంపై చేర్యాలలో నాయకులు, ప్రజలు చర్చించుకుంటున్నారు.

- చేర్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి)



చేర్యాల మున్సిపల్ కార్యాలయం

సుడా విస్తరణతో ప్రయోజనం దక్కేనా?

చేర్యాల పట్టణ అభివృద్ధిపై సందేహాలు

గతంలోనే చేర్యాల పట్టణం టౌన్ మున్సిపాలిటీ, తాలూకా, నియోజక వర్గకేంద్రంగా కొనసాగినప్పటికీ ఆనాటి పాలకుల అనాలోచిత చర్యలు, రాజకీయ వైరుధ్య పరిణామాల కారణంగా అనుకున్న మేర అభివృద్ధి జరగలేదు. గత ప్రభుత్వం 2018లో మున్సిపాలిటీగా ఏర్పాటు చేసినప్పటికీ రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో కనీస వసతుల కల్పనకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో సుడాలో భాగమైతే చేర్యాల అభివృద్ధిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సరళీకృత అభివృద్ధికి ఆస్కారం



సుడా విలీనంతో చేర్యాల మున్సిపల్ పరిధిలో సరళీకృత అభివృద్ధికి ఆస్కారం ఉంటుంది. గతంలో వెంచర్ల కోసం డీటీసీపీ అనుమతులు పొందాల్సి ఉండేది. ప్రస్తుతం సుడా అనుమతి పొందితే సరిపోతుంది. అర్బన్ డెవలప్‌మెంట్ ద్వారా పట్టణ సుందరీకరణలో భాగంగా జంక్షన్లు అభివృద్ధికి నోచుకుంటాయి. అందుబాటులో ఉన్న స్థలం దృష్ట్యా పార్కుల ఏర్పాటుకు అవకాశం ఏర్పడుతుంది. జీ+2పైబడి అంతస్తుల భవన నిర్మాణం సుడా అనుమతి ఇస్తుంది.

- నాగేందర్, చేర్యాల మున్సిపల్ కమిషనర్

అక్రమ లేవుట్ల ఆటకట్టు

భవన నిర్మాణం, లేఅవుట్ల అనుమతులు సరళీకృతం కానున్నాయి. జీ+2పైబడి అంతస్తుల భవన నిర్మాణాలకు సుడా అనుమతి పొందాల్సి ఉంటుంది. ఎక్కడ లేఅవుట్ చేసినా సుడా పరిమితులకు లోబడి అనుమతి తీసుకోవాలి. గతంలో ఎవరు పడితే వారు వెంచర్లు చేసి గ్రీన్‌ల్యాండ్, డ్రైనేజీ, రోడ్లు, స్కూల్, పార్కులాంటివి ఏర్పాటు చేయలేదు. ఇప్పటికీ పలు అక్రమ లేఅవుట్‌లుగానే గుర్తించినా మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలకు ఉపక్ర మించలేదు. సుడాతో రియల్టర్ల ఆగడాలకు చెక్ పడొచ్చు. జంక్షన్లు, పార్కుల అభివృద్ధికి సుడా నిధులను వెచ్చిస్తారు. చేర్యాల ప్రాంతానికి చెందిన వారు సుడాలో కీలకంగా ఉంటే మున్సిపాలిటీ అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. చేర్యాల మున్సిపల్‌కు దామాషా ప్రకారం నిధులు తీసుకువస్తారా.. లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

‘ప్రజావాణి’ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ మను చౌదరి



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి 19 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఎంతో నమ్మకంతో దరఖాస్తులు ఇచ్చిన అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పలు ఫిర్యాదులు.. చేర్యాల మండలంలోని దొమ్మాట నుంచి గుర్జకుంట ఎక్స్ రోడ్డు వరకు దారి బాగోలేదని, పెద్దపెద్ద గుంతలుగా ఏర్పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే మరమ్మతులు చేపట్టాలని దొమ్మాట గ్రామస్థులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మారెడ్డి రామలింగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రైతులతో కలిసి ప్రజావాణిలో కలెక్టర్ వినతి పత్రం అందజేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోహీర్, అక్టోబరు 28: (ఆంధ్రజ్యోతి) కోహీర్ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ గోపతి సతీష్ తెలిపారు. గ్రామానికి చెందిన అఫ్రోజ్ కోహీర్ పట్టణంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని రేషన్ బియ్యం ఇక్రయ వ్యాపారాన్ని చేస్తున్నాడు. దీంతో పోలీసులు దాడులు చేసి నిల్వ ఉంచిన బియ్యాన్ని సీజ్ చేసి కోహీర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

25 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

కోహీర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండల పరిధిలోని బిలాల్ పూర్, బడంపేట, పీచేర్యాగడి గ్రామాల్లో పేకాట ఆడుతున్న 25 మందిని అరెస్టు చేసినట్లు కోహీర్ ఎస్ఐ గోపతి సతీష్ తెలిపారు. వారి నుంచి ఏడు సెల్ ఫోన్లు, నాలుగు బైకులు, ఆరువేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

చేర్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన గీతకార్మికుడు బుడిగె కిష్టయ్య(65) సోమవారం తాటిచెట్టు పైనుంచి జారి కిందపడి దుర్మరణం చెందాడు. మృతుడికి ఇరువురు భార్యలు, ఐదుగురు కుమారులు ఉన్నారు.

కిష్టయ్య(ఫైల్)

విద్యుదాఘాతంతో మహిళ మృతి

వెల్దుర్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మన్నెవారి జలాల్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాష రుక్కమ్మ(53) మనుమడి పుట్టిన రోజు కావడంతో ఇంట్లో వేడుకలకు ఏర్పాట్లు చేసుకున్నారు. కుటుంబ సభ్యులందరూ కలిసి ఇంటి బయటకు కూర్చున్నారు. సాయంత్రం కావడంతో ఇంట్లో విద్యుత్ బల్బు వేయడానికి వెళ్లిన రుక్కమ్మ తిరిగి బయటకు రాకపోవడంతో కూతురు స్వప్న ఇంట్లోకి వెళ్లి చూసేసరికి రుక్కమ్మ కుప్పకూలి ఉంది. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. .

రుక్కమ్మ (ఫైల్)

వ్యాపారులు.. అధికారుల మధ్య గలాట

హుస్నాబాద్ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం రాత్రి వ్యాపారులు, అధికారుల మధ్య పెద్ద గలాట చోటు చేసుకుంది. మార్కెట్ యార్డులో ఒకరిద్దరు ట్రేడర్లు బయట పచ్చివడ్లను కొనుగోలు చేస్తూ యార్డులోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ఇబ్బందులు సృష్టిస్తున్నారని వారిని అధికారులు మందలించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా పచ్చివడ్లను కొనుగోలు చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని మార్కెట్ అధికారులను కోరారు.

బీఆర్ఎస్ పార్టీకి సీనియర్ నేత రాజీనామా

వెల్దుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి వియ్యంకుడు వెల్దుర్తి మండల పరిధిలోని దామరంచ గ్రామానికి చెందిన సిద్దిరెడ్డిగారి రాజిరెడ్డి తన వ్యక్తి గత కారణాల వల్ల పార్టీకి, క్రియా శీల సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇకముందు తను ఏ పార్టీలో చేరబోనని, దామరంచ గ్రామ అభివృద్ధికి అందరితో కలిసి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన రాజిరెడ్డి ఎమ్మెల్యే సునీతారెడ్డి వెంట బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గత కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న రాజిరెడ్డి తన వ్యక్తిగత, వ్యాపార కారణాలతో పార్టీ రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

రాజిరెడ్డి

క్రైం కార్నర్

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

● ఇద్దరు మృతి



ఘటనా స్థలంలో లారీల మధ్య పడి ఉన్న మృతదేహాలు

సదాశివపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టడంతో ఇద్దరు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే.. సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం తెల్లవారు జామున షామీర్‌పేట నుంచి జహీరాబాద్ వైపు ఇటుకల లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ టైరు పంక్చర్ అయ్యింది. దీంతో సదాశివపేట పట్టణ పరిధిలోని 65వ నంబరు జాతీయ రహదారి (బైపాస్) పక్కన ఆపి మరమ్మతులు చేస్తున్నారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి జహీరాబాద్ వెళ్తున్న మరో లారీ అతివేగంగా వచ్చి వెనక నుంచి ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో మరమ్మతులు చేస్తున్న ఘట్‌కేసర్ ప్రాంతానికి చెందిన గైక్వాడ్ దీపక్ (55), పరమేశ్వర్ (37) అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల బంధువు కేతావత్ రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

వాహనం ఢీకొని డీసీఎం క్లీనర్..



అబ్దుల్ ముబిన్ మృతదేహం

తూప్రాన్, అక్టోబరు 28 (ఆంధ్రజోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని డీసీఎం క్లీనర్ మృతిచెందిన సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ శివారులోని హైవే బైపాస్‌లో దాబా హోటళ్ల వద్ద చోటుచేసుకుంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన అబ్దుల్ ముబిన్ (25) డీసీఎం క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి డీసీఎంలో హైదరాబాద్ వెళ్తూ మార్గమధ్యలో తూప్రాన్ హైవే బైపాస్‌లో దాబా హోటల్ వద్ద వాహనాన్ని ఆపి కాలకృత్యాలు తీర్చుకుని డీసీఎం పక్కన నిలబడ్డాడు. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి అతడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

యువతి తల్లిదండ్రులు మందలించారని..

● యువకుడి ఆత్మహత్య

సదాశివపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సదాశివపేట మండలం మాలపాడు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన చిన్నమనగోని రంజిత్(19) పుల్కల్ మండలంలోని పుల్కల్ గ్రామానికి చెందిన తన తోటి విద్యార్థిని ఆదివారం పుట్టినరోజు వేడుకలకు ఆహ్వానించడంతో వెళ్లాడు. ఇది గమనించిన అమ్మాయి తల్లిదండ్రులు రంజిత్‌ను మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన అతడు ఆదివారం ఇంటికి రాకుండా సోమవారం తెల్లవారు జామున గ్రామ సమీపంలోని ఓ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.



వర్షానికి దెబ్బతినడంతో దున్ని వేసిన పత్తి పంట

తగ్గిన సంపత్తి

సగానికి పడిపోయిన దిగుబడులు

● ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల లోపే
● వర్షాభావ పరిస్థితులతో పంటకు నష్టం
● ఆందోళన చెందుతున్న రైతులు

మునిపల్లి, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి) : గత నెలలో ఎడతెరిపి లేకుండా 15రోజుల పాటు కురిసిన భారీ వర్షాల కారణంగా పత్తి రైతుల ఆశలు అడిఆశలయ్యాయి. పంట బాగుందిలే.. ఎకరానికి 15 క్వింటాల్‌కు దిగుబడి తగ్గదని అనుకున్న రైతన్నలు సగానితో (ఎకరానికి 8 క్వింటాళ్లతో) సరిపెట్టుకోవల్సి వస్తోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సొంత భూములు ఉన్న రైతుల పరిస్థితే ఇలా ఉంటే.. కౌలుకు తీసుకున్న రైతుల పరిస్థితి ఇంకా ఎలా ఉందో చెప్పనక్కర్లేదు. పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా వస్తాయో రావోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి సాగు గతేడాదిలో రైతులకు ఎకరానికి సుమారు 12 నుంచి 1 5క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తే ఈసారి మాత్రం అందుకు భిన్నంగా దిగుబడులు వచ్చాయి. ముందు మురిపించిన పత్తి పంట చేతికందే సమయానికి వర్షానికి ఆహుతైంది. కొన్ని చోట్ల పంట అనుకున్న దిగుడులు రాలేదు. మరికొన్ని చోట్ల పూర్తిగా పంట నీటికి నల్ల బారడంతో తొలగించి రబీ (శనగ) పంట వేశారు. మండల వ్యాప్తంగా 32 వేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. అందులో సుమారు 200 ఎకరాల్లోని పత్తి పంట భారీ వానలకు పూర్తిగా దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు.

భారీ వర్షాల కారణం..

ఈ సారి పత్తి పంట ఎకరాకు కేవలం 6నుంచి 8క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వస్తోందని రైతులు ఆవేదనం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 12 నుంచి 15 వరకు దిగుబడి వచ్చే తమ భూముల్లో భారీ వర్షాల కారణంగా దిగుబడి తగ్గిందని అన్నదాతలు వాపోతున్నారు. అనుకున్న పంట దిగుబడి రాలేకపోవడంతో పెట్టుబడి ఖర్చులు ఎలా రాబట్టాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ క్వింటాల్‌కు రూ.7520 నిర్ణయించినప్పటికీ ఈ దిగుబడులకు లాభాలు రావని, కనీసం రూ.10వేలు ఉంటేనే కొంతైనా లాభం చేకూరుతుందని రైతులు చెబుతున్నారు.

అనుకున్న పంట దిగుబడి రావట్లేదు



ఈ ప్రాంతంలో నల్ల రేగడి భూములు ఉన్నప్పటికీ పత్తి పంట అనుకున్న స్థాయిలో దిగుబడులు రావడం లేదు. పత్తి పంట విత్తు విత్తినప్పటి నుంచి పంట చేతికందే వరకు పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. పెట్టుబడులు పోను.. మిగిలితే తమది. అయితే ఈ సారి మాత్రం అనుకున్న లాభాలు రావడం లేదు. సెప్టెంబర్ మాసంలో కురిసిన భారీ వర్షాల కారణంగా పత్తి కాయలు పూర్తిగా నల్లబారడంతో పాటు దిగుబడి తగ్గింది.

- బుచ్చయ్య, రైతు, మల్లికార్జున్ పల్లి

చిరిగిన గన్నీ సంచులు వాపస్



చిరిగిన గన్నీ సంచుల్ని తరలిస్తున్న సొసైటీ సిబ్బంది

మద్దూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : 'చిరిగిన గన్నీ సంచులతో ఇక్కట్లు' అంటూ ఈ నెల 24న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా సివిల్ సప్లై అధికారులు స్పందించారు. చిరిగిపోయిన సంచులను తిరిగి పంపించాలని జిల్లా సివిల్ సప్లై మేనేజర్ ప్రవీణ్ సూచించడంతో రేబర్తి సహకార సొసైటీలోని 18 వేల సంచులను వాపస్ ఇచ్చారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, సీఈవో బోయిని శ్రీధర్ 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

భరోసా కేంద్రంలో తనిఖీలు



భరోసా కేంద్రంలో తనిఖీ చేస్తున్న న్యాయాధికారి రమేష్

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని భరోసా, సఖీ, శిశుకేంద్రాలను న్యాయాధికారి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ సోమవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరోసా, సఖీ కేంద్రాల్లో బాధితులకు ఉచిత న్యాయ సేవలందించాలన్నారు. శిశువిహార్‌లో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, శిశువులను దత్తత ఇచ్చేటప్పుడు అన్ని రకాల జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ప్రైవేటు ఆస్పత్రిలో వ్యక్తి మృతి

● వైద్యుల నిర్లక్ష్యమే కారణం : బంధువులు .. ఆస్పత్రి ఎదుట ఆందోళన



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

చేగుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : చికిత్స చేస్తుండగా రోగి చనిపోయాడని తెలిసినా తమ మీదకు రాకుడదన్న ఉద్దేశంతో మరో అసుపత్రికి తరలించి చేతులు దులుపుకోవాలని చూశారు ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు. వివరాల్లోకి వెళ్తే చేగుంట మండల పరిదిలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన చందా యాదగిరి(50) టాయిలెట్ సరిగా రావడంలేదంటూ సోమవారం స్థానిక ఆర్ఎంపీ వద్దకు వెళ్లాడు. పరీక్షించిన ఆయన చేగుంటలోని ఓ ప్రైవేటు అసుపత్రికి వెళ్లాలని చెప్పడంతో కుటుంబ సభ్యులు యాదగిరిని అక్కడికి తీసుకెళ్లారు. దీంతో ఆ ఆస్పత్రి వైద్యులు యాదగిరికి ఉదయం నుంచి చికిత్స అందించారు. అయితే మధ్యాహ్నం ఆపరేషన్ అంటూ హడావిడి చేసిన డాక్టర్లు ఆ తరువాత మెదక్‌లోని మరో ఆస్పత్రికి తరలించాలని సూచించారు. తీరా అక్కడికి తీసుకెళ్లగా యాదగిరిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని తెలుపడంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా కంగుతిన్నారు. చేగుంటలోని ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే యాదగిరి మృతిచెందాడని, అయినా విషయం బయటకు వస్తే ఇబ్బంది అవుతుందని భావించిన వారు మరో అసుపత్రికి తరలింపజేశారని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. దీంతో యదగిరి మృతదేహాన్ని చేగుంటలోని సదరు ఆసుపత్రి ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే చనిపోయాడని, న్యాయం చేయాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పారు.

జహీరాబాద్ సీడీసీ చైర్మన్‌గా ముబీన్



నియామక పత్రాన్ని అందుకుంటున్న ముబీన్

జహీరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ సీడీసీ చైర్మన్‌గా మొగుడంపల్లి మండలం అసద్‌గంజ్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ ముబీన్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో సోమవారం మంత్రి దామోదర రాజనర్సింహ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. సభ్యులుగా మండలానికి చెందిన మల్లారెడ్డి, మొగుంపల్లి మండలంలోని సజ్జరావుపేట తాండకు చెందిన చిన్నరాథోడ్ చందర్‌ను నియమించారు.

కోలుకున్న కేజీబీవీ విద్యార్థినులు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : న్యాల్‌కల్ కేజీబీవీలో అస్వస్థతకు గురై సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో చికిత్స పొందుతున్న బాలికల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడడంతో సోమవారం ఎనిమిది మందిని డిశ్చార్జ్ చేశారు. మూడు రోజుల కిందట కేజీబీవీ భవన నిర్మాణం, రంగులు వేయడం వల్లా దగ్గు, శ్వాస ఎలర్జీ సమస్యలతో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. అడ్మిటైన 10 మందిలో ఎనిమిది మంది ఆరోగ్యం కుదుట పడడంతో డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపగా, స్వల్ప అస్వస్థతలో ఉన్న మరో ఇద్దరికి చికిత్స అందిస్తున్నారు. వారిద్దరిని కూడా ఒకట్రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేస్తామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.జి.అనీల్‌కుమార్ తెలిపారు.

నేడు, రేపు స్పెషల్ ఎడ్యుకేషన్ సర్టిఫికేట్ వెరిఫికేషన్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-2024లో మెరిట్ సాధించిన స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులకు ఈ నెల 29, 30 తేదీల్లో ఒరిజినల్ సర్టిఫికేట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్జీటీ 1:3 మెరిట్ జాబితా డీఈవో సంగారెడ్డి వెబ్‌సైట్‌లో పొందుపర్చామని, అట్టి విద్యార్థులు సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయంలో ఉదయం 10 గంటల వరకు వచ్చి సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

కడీల తయారీకి విద్యుత్ చౌర్యం

మిషన్లను స్వాధీనం చేసుకున్న అధికారులు



అక్రమ విద్యుత్‌తో కడీలు తయారు చేస్తున్న కార్మికుడు

శివ్వంపేట, అక్టోబరు 28: ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద పెద్ద రాతి బండలను కట్ చేసేందుకు అక్రమార్కులు గుట్టు చప్పుడు కాకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతుండగా విద్యుత్ అధికారుల గుర్తించారు. ఈ మేరకు వైర్లను కట్ చేసి మిషన్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే మెదక్ జిల్లా శివ్వంపేట మండలం సీతారాం తండాలో సోమవారం పెద్ద పెద్ద గుండ్లను నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ చేయడమే కాకుండా మూడు నెలలుగా వ్యవసాయ పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి, తండాలోని సింగల్ ఫేజ్ బుడ్డి నుంచి అక్రమంగా విద్యుత్ వాడుతున్నారు. ఇతర రాష్ట్రాల కార్మికులతో బండ రాళ్ల నుంచి కడీలను తయారు చేయించి వాటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా విద్యుత్ అధికారులకు తెలిసినప్పటికీ అటువైపు వెళ్లి చూడకపోవడం గమనార్హం. అక్రమంగా విద్యుత్ ను వాడడం నేరమని చెప్పినప్పటికీ వినకపోవడంతో రెండుసార్లు వైర్లను కట్ చేసినట్లు లైన్‌మెన్ సురేష్ తెలిపారు. ఈ విషయమై తూప్రాన్ డీఈ రాజును సంప్రదించగా అనుమతులు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే ఉపేక్షించేది లేదని బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు

అత్యాచారయత్నం కేసులో 20 ఏళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితుడికి 20 సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి కె. జయంతి సోమవారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామానికి చెందిన పి.దుర్గా ప్రసాద్ (24) అదే గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలికపై 27 జూలై 2017న అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు హత్నూర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలను పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టగా, నేరం రుజువు కావడంతో నిందితుడు దుర్గాప్రసాద్‌కు 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 20 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి జయంతి తీర్పు వెల్లడించారు. ఈ కేసులో నిందితునికి జైలు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసులను జిల్లా ఎస్పీ రూపేష్ అభినందించారు.

మరో ఘటనలో పదేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి కె. జయంతి సోమవారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాలు ప్రకారం.. అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లింగమయ్య కాలనికి చెందిన కొట్టంవారి బస్వరాజ్(25) అదే కాలనీకి చెందిన ఓ బాలికపై 11 జూలై 2019న అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు బస్వరాజ్‌కు పదేళ్ల జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు.

తండ్రి సోషల్ వర్కర్..

కొడుకులిద్దరూ డాక్టర్లు..

5వపేజీ తరువాయి..

కొడుకులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్న పట్టుదలతో కొడుకులిద్దరినీ డాక్టర్ చదివిస్తున్నారు.

ఉస్మానియాలో వైద్య విద్య...

పెద్ద కుమారుడు లెనిన్‌రాజ్ పుల్కల్ మండలం బస్వాపూర్ తెలంగాణ ఆదర్శ పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసిన అనంతరం ప్రభుత్వ ఖర్చులతో కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు. 2021 నీట్‌లో మంచి ర్యాంకు సాధించి ఉస్మానియా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సంపాదించారు. ప్రస్తుతం ఎంబీబీఎస్ మూడో చదువుతున్నారు. రెండో కుమారుడు స్టాలిన్‌రాజు 2024 నీట్ ఎంట్రెన్స్‌లో మంచి ర్యాంకు సాధించగా.. ఇటీవల కౌన్సిలింగ్‌లో ఉస్మానియా వైద్య కళాశాలలోనే సీటు లభించింది. ప్రభుత్వ వైద్య కళాశాలలో సీట్లు వచ్చినప్పటికీ ఫీజులు భారంగా మారాయని కృష్ణంరాజు వాపోతున్నారు.



గతంలో ఏర్పాటు చేసిన పెంకుటిల్లు లైబ్రరీ, గ్రంథాలయ స్థాపకుడు గోవర్ధన్‌గౌడ్

ఊరి కోసం గ్రంథాలయం

● తనలాగే యువత కొలువులు సాధించాలని..
● గ్రామానికి చెందిన పీడీ ఆలోచనలకు ప్రతిరూపం
● దాతల సాయంతో పుస్తకాలు..

మనోహరాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అతను కష్టపడి చదివి.. ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. తనలాగే గ్రామానికి చెందిన యువత కూడా ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆశించాడు. చదువుకునే అవకాశం కల్పిస్తే.. తాను అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని భావించాడు. దాతల సహాయంతో ఓ పెంకుటింట్లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశాడు. పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌తో ప్రారంభించిన ఆ గ్రంథాలయంలో ఇప్పుడు వేలాది పుస్తకాలు కొలువుదీరాయి.

పుట్టిన గడ్డ కోసం..

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన పోట్టొళ్ల దశరథ, సుగణమ్మల చిన్నకుమారుడైన గోవర్ధన్‌గౌడ్ పట్టుదలతో చదివి 15 ఏళ్ల క్రితం పీఈటీగా ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం శివ్వంపేట మండలం కొంతన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో పీడీగా పని చేస్తున్నారు. అయితే, పోటీ పరీక్ష రాసే సమయంలో మెటీరియల్ కోసం గ్రంథాలయంపై ఆధారపడేవారు. గ్రామంలో గ్రంథాలయం లేకపోవడంతో పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రభుత్వ ఉద్యోగం సాధించిన తర్వాత తాను పుట్టిన గడ్డకు ఎదైనా చేయాలనే లక్ష్యం.. తనలాగే గ్రామ యువత ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడాలనే ఉద్దేశంతో 2012లో చిన్న పెంకుటింట్లో స్వామి వివేకనంద పేరుతో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలతో పాటు వివిధ కథల పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉంచారు. దాతలు సహకరిస్తే మరిన్ని పుస్తకాలు సమకూర్చుకుని నిరుద్యోగ యువతకు అందుబాటులో ఉంచుతానని ఈ సందర్భంగా గోవర్ధన్‌గౌడ్ చెప్పారు.

20కి పైగా కొలువులు

గోవర్ధన్ గౌడ్ ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయం ఎందరినో ప్రభుత్వ ఉద్యోగులను చేసింది. ఈ గ్రంథాలయంలో చదివిన సుమారు 20 మంది వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. 12 మంది పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించగా, ఇందులో ముగ్గురు ఎస్సైలు ఉన్నారు.



కానిస్టేబుళ్లుగా ఎంపికైన యువకులకు గ్రంథాలయంలో సన్మానం..

పెంకుటింటి నుంచి జీపీలోకి..

చిన్న పెంచుటింట్లో ప్రారంభమైన స్వామి వివేకనంద గ్రంథాలయం గ్రామ యువతకు అండగా నిలుస్తున్న విషయాన్ని గుర్తించిన గ్రామస్థులు దానికో చోటు కల్పించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో విశాలమైన గదిని కేటాయించారు. ప్రస్తుతం ఈ గ్రంథాలయంలో ఎప్పుడు కనీసం పది మంది చదువుకుటూ ఉంటారు.

ఇక్కడే చదివి ఎస్ఐ అయ్యా..



పోలీస్ కావాలనే ఉద్దేశంతో హైదరాబాద్‌లో కోచింగ్ సెంటర్‌లో చేరాను. మా బాబాయ్ గోవర్ధన్ గౌడ్ ప్రోత్సాహంతో ఇంటికి వచ్చి.. స్వామి వివేకానంద గ్రంథాలయంలో కూర్చొని ఇక్కడి పుస్తకాలను చదివాను. 2018లో ఎస్ఐ (సివిల్ సబ్ ఇన్స్‌పెక్టర్) ఉద్యోగం సాధించాను. గతంలో నాకు రైల్వే, పంచాయతీ కార్యదర్శి, ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగాలు వచ్చాయి. మా అక్క లావణ్య కూడా అదే సంవత్సరంలో సివిల్ ఎస్ఐ సాధించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని చిలకల్‌గూడ పీఎస్‌లో ట్రాఫిక్ ఎస్ఐగా విధులు నిర్వరిస్తున్నాను.

-హరీష్‌గౌడ్, ఎస్ఐ, మనోహరాబాద్

ఉద్యోగం రావడానికి కారణం ఈ గ్రంథాలయమే..



మాది మనోహరాబాద్. ఏడేళ్ల క్రితం పేపర్ చదివేందుకు స్వామి వివేకానంద గ్రంథాలయానికి వెళ్లాను. అక్కడే పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ చదివి ప్రిపేర్ అయ్యాను 2016, 2015లో ప్రభుత్వ ఉద్యోగానికి ప్రయత్నించి విఫలం అయ్యాను. గోవర్ధన్ ప్రోత్సాహంతో పట్టుదలతో చదివి 2020లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. ప్రస్తుతం శిక్షణ పొందుతున్నాను. గ్రామంలోని గ్రంథాలయంలో చదివి ఈ రోజు ప్రభుత్వ ఉద్యోగం సాధించగలిగాను.

-సరేష్, సివిల్ కానిస్టేబుల్

క్రైం కార్నర్

డ్రంకన్ డ్రైవ్‌లో 16 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బందితో కొన్నిరోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాల్లో, రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ చేయగా 16 మంది మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపర్చగా విచారణ చేసి 16 మందికి రూ.26 వేల జరిమానా విధించారు.

మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు



టిప్పర్లను పట్టుకున్న పోలీసులు

చేర్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం కడవేరుగు గ్రామ శివారులోని చెరువులో అనుమతులు లేకుండా నల్లమట్టి తవ్వకం చేసి టిప్పర్ల ద్వారా తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కడవేరుగు గ్రామానికి చెందిన ఆరుట్ల బాబు, కొండపాకకు చెందిన రేపాక వెంకటేశ్, తూర్పాటి రాజులు ఎక్స్‌కవేటర్లతో మట్టి తవ్వకం చేసి రెండు టిప్పర్ల ద్వారా మట్టి తరలిస్తూ అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. ఈ విషయమై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నీరేశ్ తెలిపారు.

న్యూస్ బాక్స్

పీఆర్సీని తక్షణమే అమలుచేయాలి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

కొండపాక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల పీఆర్సీని వెంటనే అమలు చేయాలని తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు క్యాతం మహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ధర్మాగ్రహ దీక్షల్లో భాగంగా మండలాధ్యక్షుడు బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టో ద్వారా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు పూడెం రఘువర్ధన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డీఎస్సీ స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024లో మెరిట్ సాధించిన జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్) అభ్యర్థులకు నేడు, రేపు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని డీఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. అభ్యర్థుల జాబితా, అభ్యర్థులకు సూచనలు జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. 29, 30వ తేదీల్లో నిర్వహించే ఈ వెరిఫికేషన్ ప్రక్రియ సిద్దిపేటలోని ప్రభుత్వ బాలుర పాఠశాల (మెదక్ రోడ్)లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. వెరిఫికేషన్‌కు వచ్చే అభ్యర్థులు తమ విద్యార్హతకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్స్, అటెస్టేషన్ చేయించిన 2 జిరాక్స్ సెట్లు, నాలుగు కలర్ పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, చెక్ లిస్టు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

అపార్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన

మిరుదొడ్డి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శారద, ఒకేషనల్ అధ్యాపకుడు భాస్కర్ మాట్లాడారు. అపార్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేయాలని సూచించారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి: సీపీఎం

మిరుదొడ్డి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపాలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం మిరుదొడ్డిలో సీపీఎం నాయకులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వం యేటా కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి విఫలమైందని మండిపడ్డారు. ఆయన వెంట సీపీఎం మిరుదొడ్డి మండల కన్వీనర్ అంజయ్య ఉన్నారు.



స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న తాత్కాలిక గ్రంథాలయం



గ్రంథాలయంలో పుస్తక పఠనం

కలగానే ఆధునిక గ్రంథాలయం

సమస్యల వలయంలో విజ్ఞాన భాండాగారం

- శంకుస్థాపనతోనే సరి
- సొంత భవనం లేక పాఠకుల అవస్థలు

దుబ్బాక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దుబ్బాకలో ఆధునిక గ్రంథాలయ నిర్మాణం కలగానే మిగిలిపోయింది. పోటీ పరీక్షలకు విద్యార్థులను తీర్చిదిద్దే ఆధునిక విజ్ఞాన భాండాగారం కోసం కేటాయించిన నిధులు దారిమళ్లాయి. ఫలితంగా సొంత భవనం లేక జూనియర్ కళాశాల పాత భవనంలో గ్రంథాలయం తాత్కాలికంగా కొనసాగుతోంది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకంగా పనిచేసిన గ్రంథాలయం ఇప్పుడు.. వసతులు లేక కొట్టుమిట్టాడుతోంది. దుబ్బాకలో 1937లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. నిజాం మీద పోరాటం కోసం ఇదే గ్రంథాలయం గోడలే వేదికగా గోడపత్రికలను అతికించేవారు. ఆ తర్వాత మొదటిసారిగా గోల్కొండ పత్రికతో ప్రారంభమైన గ్రంథాలయానికి ఎంతో చరిత్ర ఉండేది. భారత స్వాతంత్ర్యోద్యమం తరువాత 1973లో ప్రభుత్వం అధికారికంగా మంజూరు చేసింది. అప్పటి ఎమ్మెల్యే ఐరేణి లింగయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం శిథిలావస్థకు చేరింది. 2016లో అప్పటి సీఎం కేసీఆర్ దుబ్బాక పర్యటనలో భాగంగా అధునాతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.2 కోట్లను ఎస్‌డీఎఫ్ నిధుల కింద మంజూరు చేశారు. అయితే ఈ నిధులకు కూడా మోక్షం లేకుండాపోయింది.

నిధుల మళ్లింపు

గ్రంథాలయాన్ని అధునాతనంగా నిర్మించేందుకు అప్పటి ఎమ్మెల్యే, దివంగత నేత రామలింగారెడ్డి ఆధ్వర్యంలో సిరిసిల్లలోని సినారె గ్రంథాలయాన్ని కూడా పరిశీలించారు. అయినా మోక్షం లభించలేదు. రామలింగారెడ్డి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత 2019 నవంబరు 1న అప్పటి మంత్రి హరీశ్‌రావు గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్థల సేకరణలో స్థానిక నాయకుల తీరుతో నిధులను దారి మళ్లించి కుల సంఘాలకు కేటాయించారు. శిథిలావస్థలో ఉన్న భవనం ప్రమాదకరంగా మారడంతో కూల్చేసి, మొదట పాత గ్రామపంచాయతీ భవనంలోకి మార్చారు. ప్రస్తుతం జూనియర్ కళాశాలకు తరలించారు. పట్టణం చివర ఉన్న జూనియర్ కళాశాలకు వెళ్లాలంటే పాఠకులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఇద్దరు, ముగ్గురే పుస్తక పఠన చేస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రంథాలయం జూనియర్ కళాశాల పాత భవనంలో ఉన్నదనే విషయం కూడా విద్యార్థులకు తెలియకపోవడం గమనార్హం. ప్రభుత్వం స్పందించి గ్రంథాలయాన్ని అధునాతనంగా నిర్మించాలని పాఠకులు కోరుతున్నారు.

త్వరలోనే పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

- సమీకృత మార్కెట్ చుట్టూ మడిగలను నిర్మిస్తాం
- గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తామని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని సమీకృత మార్కెట్ చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి తీర్మానించినట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించడానికి కృషి చేస్తామని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ పంటలను వినియోగించుకోవాలన్నారు. పాతూరు రైతు మార్కెట్లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీ, డైరెక్టర్లు నర్సింహులు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, గజ్వేల్ వ్యవసాయ శాఖ ఏడీఏ బాబునాయక్, సూపర్‌వైజర్ మహిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.



కొమురవెల్లి: ఐనాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నల్లనాగుల శ్వేత

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చేర్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన నల్లనాగుల శ్వేత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలుకేంద్రంలోనే విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మేరుగు కృష్ణ, మాజీ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ వంగ కృష్ణారెడ్డి, కాంగ్రెస్ మహిళా జిల్లా కార్యదర్శి చెరుకు సుమలత, నాయకులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలి

- సిద్దిపేట జిల్లా భూగర్భజల అధికారి నాగరాజు

మద్దూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : భవిష్యత్ తరాల అవసరాలకు భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సిద్దిపేట జిల్లా భూగర్భజల అధికారి నాగరాజు తెలిపారు. సోమవారం మద్దూరు మండలంలోని నర్సాయపల్లిలో జిల్లా భూగర్భజల శాఖ నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో 'భూగర్భజలాల నిర్వహణ-అభివృద్ధి'పై రైతులకు, పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ భూగర్భజలాల అభివృద్ధికి ఇంకుడు గుంతలు, పాంపాండ్స్, రాక్‌ఫిల్ డ్యామ్‌లు, కాంటూర్ కందకాలు నిర్మించుకోవాలని సూచించారు. నీటిని వృథా చేయరాదన్నారు. రైతులు వాలుకి అడ్డంగా దుక్కులు చేసుకోవాలని సూచించారు. అంతకుముందు విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్ పౌజియా, సీనియర్ అసిస్టెంట్ స్వరూన, రాజ్ కమల్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రాంరెడ్డి, హెచ్‌ఎం ప్రసూన లక్ష్మి, ఉపాధ్యాయులు రాజేశం, ఆంజనేయులు, నాగేందర్, నర్సింహులు, సుభాషిణితో పాటు ధాన్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగరాజు

సార్లవాడలో పోలీస్ అధికారుల సందర్శన

కొండపాక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సార్లవాడ గ్రామాన్ని పోలీసు ఉన్నతాధికారులు సోమవారం సందర్శించారు. గ్రామంలో ఆదివారం రాత్రి ప్రార్థనా మందిర నిర్మాణాన్ని కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారని తెలియడంతో పోలీసులు విచారణ చేపట్టారు. అదనపు డీసీపీ మల్లారెడ్డి, గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం, తొగుట సీఐ లతీఫ్‌తో పాటు పలువురు పోలీసులు గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. ప్రజలంతా సామరస్యంగా ఉండాలని డీసీపీ తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా ఎవరూ ఇలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని సూచించారు. నిర్మాణాన్ని కూల్చివేసిన పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.



కూల్చివేత నిర్మాణం వద్ద విచారణ చేస్తున్న పోలీసులు అధికారులు

ఉద్యోగ విరమణ తప్పనిసరి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి



మల్లుపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

మిరుదొడ్డి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ఉద్యోగ విరమణ తప్పనిసరి అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. సోమవారం మిరుదొడ్డి మండలం మల్లుపల్లి ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు భూమలింగం ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిరుపేద విద్యార్థులకు తమదైన శైలిలో ఉన్నతమైన విద్యనందించడానికి ఎంతోగానో కృషిచేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి, దుబ్బాక ఎంఈవోలు ప్రవీణ్‌బాబు, అంజాగౌడ్, ప్రభుదాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాశాలలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ తనిఖీ



విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి

చిన్నకోడూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు మండలంలోని పెద్దకోడూరు శివారులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను సోమవారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కళాశాలలోని తరగతి గదులు, హాస్టల్‌ను, వంట గదిని, కళాశాల సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను, విద్యార్థినులకు అందిస్తున్న భోజన నాణ్యతను, బియ్యాన్ని, వంట సామగ్రిని పరిశీలించారు. హాస్టల్‌లోని టాయిలెట్స్, మరుగుదొడ్ల డ్రైనేజీ సిస్టం సరిగా లేదని వెంటనే సరిచేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి: సీఐ

గజ్వేల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోని లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా కష్టపడి చదవాలని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చట్టాలు, సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఇలాంటి వివరాలు తెలుపవద్దన్నారు. వారివెంట ప్రిన్సిపల్ రమేష్, పీటీం సిబ్బంది ఉన్నారు.

చదువుకుంటేనే మంచి భవిష్యత్: సీఐ

చేర్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని చేర్యాల సీఐ ఎల్.శ్రీను సూచించారు. కొమురవెల్లి మండలం గురువన్నపేట జడ్పీఎస్ఎస్‌లో సోమవారం విద్యార్థులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు.

సామాజిక సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి అవసరం

సిద్దిపేట కల్చరల్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరిచేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఏసీపీ మధు సూచించారు. హైదరాబాద్‌లో ఐటీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంధుల కోసం నిర్మిస్తున్న భవనానికి సిద్దిపేట పట్టణంలోని అంబిటస్ విద్యార్థులు రూ.లక్షా 7 వేల 500ల చెక్కును ఏసీపీ చేతులమీదుగా ఫౌండేషన్ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా అంబిటస్ విద్యార్థులను, యాజమాన్యాన్ని ఏసీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎడ్ల శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతీశ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ విజయభాస్కరరావు, ఫౌండేషన్ ప్రతినిధులు పద్మ, నాగేంద్రమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఏసీపీ మధు, స్కూల్ మేనేజ్‌మెంట్

సోషల్ ఎకానమీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



సమావేశంలో సర్వే నిర్వహణపై సిబ్బందికి సూచనలిస్తున్న కొమురవెల్లి తహసీల్దార్ లక్ష్మీనారాయణ

చేర్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సోషల్ ఎకానమీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కొమురవెల్లి తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మండల ప్రత్యేకాధికారి ఎస్‌కే.అహ్మద్ అన్నారు. కొమురవెల్లి తహసీల్ కార్యాలయంలో సోమవారం సర్వే నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కులగణన నిమిత్తం ప్రభుత్వ సూచనానుసారం ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలని, వివరాల సేకరణలో ఎలాంటి పొరబాట్లు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. సర్వే నిర్వహణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుమారస్వామి, డీటీ వేణుగోపాల్, ఎంపీఈవో శ్రీనివాస్, ఆర్ఐ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారి

కుకునూరుపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మంగోల్ గ్రామానికి చెందిన పోచమైన రమేష్ గతంలో అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారి సీఎం సహాయనిధికి దరఖాస్తు చేశారు. కాగా సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.42 వేల చెక్కును కిరణ్‌కుమార్ రమేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నర్సింహులు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా పిల్లి నర్సింహులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్‌రావు తెలిపారు. సోమవారం సిద్దిపేటలోని ఓ ఫంక్షన్‌హాల్లో జరిగిన సమావేశంలో నూతన కమిటీని నియామకం చేసి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ముందస్తు దీపావళి



దీపావళి వేడుకల్లో చిన్నారులు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల మధిర గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు ముందస్తు దీపావళి నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట వివిధ రకాల పూలతో దీపాలంకరణ చేసి టపాసులు పేల్చి సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఆర్‌పీ రజిత, టీచర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అన్ని పండుగలకు ముందస్తు వేడుకలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పర్ శ్రావణి, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



మద్దూరు తహసీల్దార్ రహీం

దుబ్బాక/మద్దూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక తహసీల్దార్ గా సోమవారం ఇ.సంజీవ్‌కుమార్ పదవీబాధ్యతలు స్వీకరించారు. మద్దూర్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన తన పదవీబాధ్యతలను స్వీకరించారు. దుబ్బాకలో పనిచేసిన వెంకట్‌రెడ్డి సిద్దిపేట రూరల్‌కు బదిలీ అయ్యారు. ఆయన ఇక్కడినుంచి బాధ్యతలనుంచి రిలీవ్‌కావడంతో సంజయ్‌కుమార్ బాధ్యతలను చేపట్టారు. అలాగే మద్దూరు మండల తహసీల్దార్‌గా ఎండీ ఏజీ రహీం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఈ.సంజీవ్‌కుమార్ దుబ్బాకకు బదిలీపై వెళ్లగా.. ఖమ్మంలో పనిచేసిన ఎండీ ఏజీ రహీం మద్దూరుకు బదిలీపై వచ్చారు. మండల ప్రజల, ప్రజాప్రతినిధుల సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ రుణాలు మంజూరు చేయండి

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ బ్యాంక్ రుణాలు అందించాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు బ్యాంకర్లకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రియారిటీ సెక్టార్ లెండింగ్‌లో విరివిగా రణాలు ఇవ్వాలన్నారు. జన సురక్ష క్యాంపులు జరిపి కష్టమర్లందరికీ ఇన్సూరెన్స్ చేయాలని తెలిపారు. నాబార్డుకు సంబంధించిన సబ్సిడీ పథకాలను మేనేజర్స్‌కు వివరించారు.

పశుగణన షురూ

నాలుగు నెలల పాటు సర్వే

(ఐదో పేజీ తరువాయి)

8,19,992 గొర్రెలు ఉన్నాయి. పశు గణనలో భాగంగా తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్దులు, గేదెజాతి పశువులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, పొట్టి గుర్రాలు, గాడిదలు, ఒంటెలు, కుక్కలు, పెంపుడు కుక్కలు, కుందేళ్లు, ఏనుగులు, కోళ్ల రకాలను లెక్కించనున్నారు.

తొలిసారి ఆన్‌లైన్‌లో

ఎన్యుమరేటర్లు జిల్లాలోని అన్ని ఇళ్లను సందర్శించి పూర్తి సమాచారాన్ని తీసుకుంటారు. సర్వే చేసినట్లుగా ప్రతీ ఇంటిని గుర్తించడానికి స్టిక్కర్ అంటిస్తారు. పశువుల పెంపకంలో నిమగ్నమైన మహిళలు, రైతుల వివరాలు, పశువుల వయస్సు సేకరించి నమోదు చేస్తారు. ఇప్పటివరకు లెక్కల డేటా పుస్తకాల్లో నమోదు చేశారు. తొలిసారిగా స్మార్ట్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో పశుగణన జరుగుతోంది. ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే పారదర్శకంగా చేస్తున్నారా, అంచనా ప్రకారం వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారా లేదా అని సూపర్‌వైజర్లుగా ఉన్న పశువైద్యాధికారులు పర్యవేక్షిస్తారు. సర్వే చేసిన వివరాలను జిల్లా నోడల్ అధికారి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తారు.

పశు గణన సర్వేకు సహకరించాలి

ప్రజలు, రైతుల ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఐదు సంవత్సరాలకు ఒకసారి పశుగణనను చేపడుతుంది. ఈసారి 21వ పశుగణన చేపడుతున్నాం. ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలి. ఆన్‌లైన్ ద్వారా యాప్‌లో చేయనున్న సర్వేకు ఎన్యుమరేటర్లు అడిగిన ప్రశ్నలకు సమాచారం అందించాలి.

– డాక్టర్ జగత్ కుమార్‌రెడ్డి, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి